సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 10 । జూన్ । 2025



తల్లికి వంచన
తల్లికి వందనం పేరుతో చంద్రబాబు మహిళలను మోసం చేశాడు. ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఇస్తానని మాటిచ్చి ఏడాదైనా పావలా కూడా ఇవ్వలేదు. 8లో



అనంతలో రెండు కోవిడ్ కేసులు
అనంతపురంలో రెండు కోవిడ్ కేసులు నమోదయ్యాయి. సర్వజనాస్పత్రిలో ఓ గర్భిణి, నగరంలోని రామ్‌నగర్‌కు చెందిన వివాహితకు కోవిడ్ సోకినట్లు తేలింది.



జిల్లా పరిధిలో సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై చాలా ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

వినతుల వెల్లువ
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 228 అర్జీలు
- ప్రతి అర్జీకి సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ చేతన్ ఆదేశం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: అర్హత ఉన్నా పింఛన్ మంజూరు కాలేదని ఒకరు... ఇంటి బిల్లులు పడలేదని మరొకరు..తన భూమిని దౌర్జన్యంగా ఆక్రమించారని ఇంకొకరు.. ఇలా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు కలెక్టర్ టీఎస్ చేతన్ ఎదుట తమ బాధలు ఏకరువు పెట్టారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతులు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలపై ఏకంగా 228 అర్జీలు అందాయి. ప్రతి అర్జీకి సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో పురోగతిపై ప్రతి వారం సమీక్షిస్తానన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ విజయ సారథి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో జిల్లా ముందడుగు వేయాలి

'స్వర్ణాంధ్ర -2047'లో భాగంగా జిల్లా అన్ని రంగాలలో ముందడుగు వేసే విధంగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ముఖ్య ప్రణాళికా విభాగం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ విజన్ ప్లాన్ యూనిట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. రానున్న ఐదేళ్లలో సాధించే అభివృద్ధితోపాటు, 2047 నాటికి సాధించాల్సిన అభివృద్ధిని డిస్ట్రిక్ విజన్ ప్లాన్‌లో పొందుపరిచామన్నారు. ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, మౌలిక వసతులు కల్పించడం, అభివృద్ధి తదితర అంశాలు యాక్షన్ ప్లాన్‌లో ఉన్నాయన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి నిర్వహించిన వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.


జెడ్పీ సీఈఓగా శివశంకర్



జి.శివశంకర్

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ సీఈఓగా గంగుండి శివశంకర్ నియమితులయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా డ్వామా ఏపీడీగా పని చేస్తున్న ఆయనను రెగ్యులర్ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఒకట్రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన శివశంకర్ 1998లో ఎంపీడీఓగా ఎంపికయ్యారు. అదే జిల్లాలోని సి.బెళగల్, హొళగుంద, గోనేగండ్ల, మద్దికెర, పత్తికొండలో ఎంపీడీఓగా పని చేశారు. ఆ తరువాత పదోన్నతిపై శ్రీసత్యసాయి జిల్లా డ్వామా ఏపీడీగా 2022లో నియమితులయ్యారు. అప్పటి నుంచి ఆయన అక్కడే కొనసాగుతున్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్



పరిగి: మండలంలోని ఎస్.ముద్దిరెడ్డిపల్లికి చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసిన పోలీసులు... నిందితుడు అఖిల్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, సోమవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. నాలుగు రోజులు క్రితం మైనర్ బాలికతో పాటు అఖిల్ కనిపించకుండా పోయాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు గాలింపు చేపట్టి ఆచూకీ గుర్తించి బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ క్రమంలో అఖిల్‌పై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి, సోమవారం న్యాయస్థానంలో హాజరు పరిచారు. కాగా, బాలికకు సోమవారంతో మైనారిటీ తీరినట్లుగా పోలీసులు పేర్కొన్నారు.

రాప్తాడులో రాక్షస పాలన

- మూడు నెలల వ్యవధిలోనే మూడు హత్యలు
- రాష్ట్రంలో గిరిజనులు, దళితులు, మహిళలకు రక్షణ కరువు
- సీఎం, డిప్యూటీ సీఎం, హోం మంత్రి స్పందించకపోవడం బాధాకరం
- శాంతి భద్రతల విషయంలో పూర్తిగా విఫలమైన పోలీసులు
- దోషులకు శిక్షపడేలా కేసు విచారణ జరగాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి



దళితులతో కలిసి ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉషశ్రీచరణ్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: రామగిరి మండలంలో ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో వాస్తవాలు వెలుగులోకి వచ్చినా.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత స్పందించపోవడం బాధాకరమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు దాదాపు 400 మంది దళితులతో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చారు. మహిళలపై అఘాయిత్యాలు అరికట్టాలని, రామగిరి మండలంలో బాలికపై జరిగిన అత్యాచార ఘటనలో దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. అలాగే అనంతపురంలో గిరిజన విద్యార్థి తన్మయిని దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ రత్నను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు ఎస్పీ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు.

హోంమంత్రి స్పందించకపోవడం సిగ్గుచేటు..

కూటమి ప్రభుత్వ పాలనలో దళితులు, గిరిజనులు, మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. రామగిరిలో దళిత బాలికపై, అనంతపురంలో గిరిజన బాలికపై అఘాయిత్యం జరిగితే హోం మంత్రి అనిత స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. మహిళలకు అన్యాయం జరిగితే అదే వారికి చివరి రోజు అంటూ గొప్పలు చెప్పిన సీఎం చంద్రబాబు.. ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. నిత్యం సనాతన ధర్మం గురించి మాట్లాడే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... దళిత, గిరిజన బాలికలకు అన్యాయం జరిగితే చోద్యం చూస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో మహిళల రక్షణ కోసం 'దిశ' యాప్ ప్రవేశపెట్టారని, దీనివల్ల అత్యవసర సమయంలో మహిళలు, బాలికలకు నిమిషాల వ్యవధిలోనే సాయం అందేదన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'దిశ' యాప్‌ను పనికిరాకుండా చేసిందన్నారు. నేడు దిశ యాప్ అందుబాటులో ఉంటే బాలికలపై అఘాయిత్యాలు జరిగి ఉండేవి కావన్నారు. అలాగే వలంటరీ వ్యవస్థ ఉన్నా.. విషయం తెలిసేదన్నారు. ఈ వ్యవస్థలన్నింటినీ ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేయడంతో దళిత మైనర్ బాలికపై అత్యాచారం జరిగినా కాపాడుకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. బాలికపై 14 మంది కామాంధులు నెలల తరబడి దాష్టీకానికి ఒడిగట్టినా.. రాజకీయంగా ఈ ఘటనను అణగదొక్కాలని చూడటం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా నిష్పక్షపాతంగా కేసు విచారణ చేసి దోషులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ఎస్పీని కోరినట్లు ఉషశ్రీచరణ్ తెలిపారు.



ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, దళిత సంఘాల నాయకులు

దళితుల ప్రాణాలకు విలువలేదా?



మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి, ఉషశ్రీచరణ్

మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ... రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల కుటుంబం రాక్షస పాలన సాగిస్తోందన్నారు. మూడు నెలల వ్యవధిలోనే మూడు హత్యలు జరిగాయంటే అక్కడ శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. పరిటాల కుటుంబం చెప్పిందే వేదం, చెప్పిందే చట్టం అన్నట్లుగా అరాచకం సాగుతోందన్నారు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. టీడీపీ ఎమ్మెల్యే సొంత పంచాయతీ పరిధిలోని ఓ గ్రామంలో తండ్రి లేని మైనర్ దళిత బాలికపై 14 మంది కొన్ని నెలల పాటు అత్యాచారం చేసి బయటకు పొక్కనివ్వకుండా చూశారంటే వారి దాష్టీకం ఎంతలా సాగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. రౌడీ షీటర్ నాగరాజు బాలికను ఆమె తల్లిని భయభ్రాంతులకు గురిచేసి విషయం బయటకు రాకుండా చేశారన్నారు. ఈ విషయంలో స్థానిక పోలీసులు పూర్తిగా నిర్లక్ష్యం వహించారన్నారు. ఈ రాష్ట్రంలో దళితుల ప్రాణాలకు విలువలేదా..? అని ప్రశ్నించారు. అత్యాచారం చేసిన దోషులకు శిక్షపడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబిలేసు, జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, నేతలు ఆంజనేయులు, అసాది గంగిశెట్టి, ఓబులేసు, జిల్లా అధికారి ప్రతినిధి ఫొటోసాయి, మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, జెడ్పీటీసీలు చంద్రకాంత్, అశోక్‌కుమార్, నాగలక్ష్మమ్మ, నాయకులు ఎస్టీడీ నరసింహులు, రామయ్య, ఆంజనేయులు, అనిల్‌కుమార్, నగేష్, చౌడప్ప, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిత



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, కలెక్టర్ చేతన్



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

- కష్టపడి చదివి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలి
- విద్యార్థులకు ఎమ్మెల్యే సింధూరరెడ్డి, కలెక్టర్ చేతన్ పిలుపు
- పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన వారికి 'షైనింగ్ స్టార్' అవార్డుల ప్రదానం

పుట్టపర్తి: చదువుతోనే ఉజ్వల భవిత సాధ్యమని, విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్లి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన 225 మంది పది, ఇంటర్ విద్యార్థులను ప్రభుత్వం 'షైనింగ్ స్టార్స్'గా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. సోమవారం కొత్తచెరువు సమీపంలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, కలెక్టర్ టీఎస్ చేతన్, డీఈఓ కృష్ణప్ప తదితరులు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు, మెమొంటోలు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింధూరారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించిన రూ.20 వేల ఆర్థిక సాయం వారి ఉన్నత చదువులకు కొంతమేర ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలన్నారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ... విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు పొందాలని సూచించారు. డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం డీఈఓ కృష్ణప్ప మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో పాటు పలువురు అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ప్రైవేట్'కే అధిక ప్రాధాన్యం..

ప్రతిభా అవార్డులు అందించే విషయంలో ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకే అధిక ప్రాధాన్యం ఇచ్చింది. జిల్లాలో 400 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలల్లో పదో తరగతి చదివిన 85 మందికే ప్రతిభా పురస్కారాలు అందించారు. కానీ ప్రైవేటు పాఠశాల్లో చదివిన 102 మంది విద్యార్థులకు పురస్కారాలు అందించడం విశేషం.

నేటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ



ధర్మవరంలో విత్తన వేరుశనగ నాణ్యత పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

పుట్టపర్తి అర్బన్: రాయితీపై రైతులకు అందజేసే విత్తన వేరుశనగ పంపిణీని జిల్లాలో మంగళవారం ప్రారంభం కానుంది. పుట్టపర్తి మండలం పెడపల్లిలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి విత్తన పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) సుబ్బారావు తెలిపారు. ఆ వెంటనే ప్రతి నియోజకవర్గంలోనూ ఆయా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో విత్తన పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. ప్రభుత్వం జిల్లాకు 63,918 క్వింటాళ్ల విత్తనం కేటాయించగా, ఇప్పటి వరకూ 29 వేల క్వింటాళ్ల విత్తనం వచ్చినట్లు ఆయన వెల్లడించారు. కే-6, టీసీజీఎస్-1694 విత్తనం 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2,790 కాగా, 40 శాతం సబ్సిడీ పోనూ రైతు తన వాటాగా రూ.1,674 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇక కదిరి లేపాక్షి రకం 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2,460 కాగా, సబ్సిడీ పోనూ రైతు తన వాటాగా రూ.1,476 చెల్లించాల్సి ఉంటుందన్నారు. గరిష్ఠంగా 3 బస్తాల విత్తనం అందించనున్నట్లు డీఏఓ వెల్లడించారు. ఇక కందులు కూడా మినీకిట్స్ రూపంలో త్వరలోనే పంపిణీ చేస్తారన్నారు.

'పురం' మున్సిపల్ కమిషనర్‌పై వేటు

- బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ
- సెర్ప్‌లో రిపోర్టు చేసుకోవాలని సంగం శ్రీనివాసులుకు ఆదేశం

చిలమత్తూరు: హిందూపురం మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులపై బదిలీవేటు పడింది. కనీస విద్యార్హత లేకపోయినా మున్సిపల్ కమిషనర్‌గా పోస్టు దక్కించుకుని అవినీతి అక్రమాల్లో ఆరితేరిన ఆయనపై ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించారు. ఆయన్ను బదిలీ చేసి మాతృసంస్థ 'సెర్ప్'లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశిస్తూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కమిషనర్ అక్రమాలపై కోర్టుమెట్లెక్కిన 'పురం' వాసులు

మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు అవినీతి అక్రమాలపై ఫిర్యాదు చేసినా స్థానిక టీడీపీ నేతల అండతో ఆయన కొనసాగుతూ వచ్చారు. కమిషనర్‌ను అడ్డుపెట్టుకుని టీడీపీ నేతలు పురం మున్సిపాలిటీలో భారీగా దోచేసినట్లు ఆరోపణలున్నాయి. కాలువల పూడిక తీత పనుల్లో రూ.80 లక్షలు, కంపోస్ట్ యార్డు పనుల్లో రూ. 5 కోట్లు అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో పలువురు స్థానికులతో పాటు వైఎస్సార్ సీపీ నేతలు మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శుల అండ ఉండటంతో ఎవరూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పలువురు స్థానికులు కమిషనర్ అవినీతి అక్రమాలు, కమిషనర్‌గా ఆయన విద్యార్హత సరిపోదని కోర్టులో పిటిషన్ వేశారు. కోర్టులో విచారణ జరిగితే తమ బండారం బయటపడుతుందన్న భయంతో రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులు స్పందించి సంగం శ్రీనివాసులను బదిలీ చేశారు. అయితే కమిషనర్ చేసిన అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని, ఆయన్ను బదిలీ చేయడం ద్వారా అక్రమాల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోబోమని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

నూతన కమిషనర్‌గా మల్లికార్జున

కాగా హిందూపురం మున్సిపల్ నూతన కమిషనర్‌గా ప్రభుత్వం మల్లికార్జునను నియమించింది. ఈ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు.

7 మండలాల్లో వర్షం



హిందూపురంలో జోరుగా కురుస్తున్న వర్షం




మేళాపురం సర్కిల్‌లో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

పుట్టపర్తి అర్బన్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ జిల్లాలోని 7 మండలాల పరిధిలో వర్షం కురిసింది. అత్యధికంగా అమరాపురం మండలంలో 22.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక గుడిబండ మండలంలో 5.4 మి.మీ, రొళ్ల 4.2, అగళి 4.2, హిందూపురం 4.2, రొద్దం 1.8, పుట్టపర్తి మండలంలో 1.8 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గోరంట్ల, ఓడీ చెరువు, చిలమత్తూరు తదితర మండలాల్లో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. రానున్న నాలుగు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కాగా, హిందూపురంలో సోమవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. దీంతో పట్టణంలోని రహదారులు జలమయమయ్యాయి. కాలువలు పొంగిపొర్లగా...మురుగు నీరు రోడ్లపైకి చేరింది. చాలా ప్రాంతాల్లో మోకాళ్లలోతు నీరు చేరింది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

పిడుగుపాటుకు నలుగురికి గాయాలు

హిందూపురం: హిందూపురం పట్టణ సమీపంలోని మోత్కుపల్లి వద్ద పిడుగుపడి నలుగురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం సాయంత్రం ఉన్నట్టుండి వర్షం రాగా, రాకేష్‌రెడ్డి, ఫణిత్‌కుమార్, తరుణ్, వంశీ మోత్కుపల్లి సమీపంలోని చింతచెట్టు కిందకు చేరారు. చెట్టుపై పెద్ద శబ్దంతో ఒక్కసారిగా పిడుగు పడింది. ఈ ఘటనలో అక్కడే ఉన్న నలుగురూ గాయపడ్డారు. రాకేష్ కడుపు, నడుము భాగంలో, ఫణిత్‌కు గొంతుకు, తరుణ్‌కు తొడ భాగంలో గాయాలయ్యాయి. వంశీ సొమ్మసిల్లిపడిపోయాడు. వీరిని కుటుంబ సభ్యులు, స్నేహితులు హిందూపురం ప్రభుత్వ తరలించి చికిత్స అందిస్తున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాకేష్‌రెడ్డి



చికిత్స పొందుతున్న ఫణిత్ కుమార్

'సాక్షి' కార్యాలయంపై దాడి గర్హనీయం

- దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- జిల్లా వ్యాప్తంగా పోలీసులకు ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు




పెనుకొండలో ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

సాక్షి, నెట్‌వర్క్: సాక్షి చానల్ డిబేట్‌లో జరిగిన ఒక సంఘటనను సాకుగా తీసుకుని సాక్షి కార్యాలయాలపై దాడులకు దిగిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. డిబేట్‌లో జర్నలిస్ట్ కృష్ణంరాజు తన వ్యక్తిగత విషయాన్ని వెల్లడించగా.... దాన్ని సాక్షి చానల్‌కు ఆపాదించడమే కాక 'సాక్షి' కార్యాలయంపైకి దండెత్తడం దారుణమన్నారు. ఈ ఘటన వెనుక రాజకీయ ప్రమేయం ఉందన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. అలాగే పోలీసులు అదుపులోకి తీసుకున్న సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లాలోని పలు మండలాల్లో జర్నలిస్టులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- పెనుకొండలో జర్నలిస్టులు టి.మల్లికార్జున, గోవింద్, మురళి, జాకీర్ తదితరులు ఎస్ఐ. వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు.
- హిందూపురంలో పత్రికా విలేకరుల సంఘం ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, రాజేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రొద్దం పోలీసు స్టేషన్‌లోనూ నాగరాజు ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు.

పత్రికా స్వేచ్ఛను హరించడమే

- వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు శంకర నారాయణ



సాక్షి, పుట్టపర్తి: జర్నలిస్టుల అక్రమ అరెస్టులు పత్రికా స్వేచ్ఛను హరించడమేనని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ శంకర్ నారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కొమ్మినేని జర్నలిస్ట్‌గా ప్రజాస్వామ్యంలో తన పాత్రను మాత్రమే పోషించారన్నారు. మరో సీనియర్ జర్నలిస్ట్ కృష్ణం రాజు కూడా జాతీయ ఆంగ్ల దినపత్రికలో వచ్చిన అంశాలనే చెప్పారన్నారు. వాటిని వక్రీకరించి జర్నలిస్టులను అక్రమ అరెస్టులు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం నిజం చెప్పేవారి గొంతునొక్కేందుకు పోలీసులను ప్రయోగిస్తోందన్నారు. మరోవైపు కూటమి నేతలు సాక్షి కార్యాలయాలపై దండెత్తడం కూటమి సర్కార్ అరాచక పాలనకు అద్దం పడుతోందన్నారు.

తల్లికి 'వంచన'





చిత్రంలో కనిపిస్తున్నది పరిగి మండలం శ్రీరంగరాజుపల్లికి చెందిన నారాయణస్వామి, శిల్ప దంపతులు. వీరికి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు అమ్మ ఒడి పథకం అందుకున్నారు. అయితే ఎన్నికల సమయంలో చంద్రబాబు.. ఇంట్లో అందరికీ పథకం వర్తిస్తుందంటే ఆనందపడ్డారు. కానీ అధికారం చేపట్టాక పథకం ప్రస్తావనే లేకపోవడంతో ఇప్పుడు ఆరుగురు పిల్లలను చదివించడం ఇబ్బందిగా మారి ఒకరిద్దరిని చదువు మాన్పించే పరిస్థితి నెలకొంది.

- అమ్మఒడి పథకాన్ని 'తల్లివందనం'గా మార్చిన కూటమి
- ఇంట్లో ఎంత మంది చదువుకుంటే అందరికీ ఆర్థిక సాయం అంటూ హామీ
- ఏడాది ముగిసినా లబ్ధిదారులకు అందని నగదు
- తల్లులను వంచించిన చంద్రబాబు

'నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. ఇంట్లో పాఠశాలకు వెళ్లే చిన్నారులు ఎందరు ఉన్నా.. ఒక్కొక్కరికీ రూ.15 చొప్పున అందరికీ తల్లికి వందనం పేరుతో తల్లుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తాం'

– ఎన్నికల సమయంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు నేటికీ కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం.

సాక్షి, పుట్టపర్తి: ఇంట్లో ఎందరుంటే అందరికీ ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం పేరుతో తల్లుల బ్యాంకు ఖాతాలో నగదు చేస్తామని 2024 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి ఏడాది గడిచి పోయింది. ఇప్పటికీ అతీగతి లేదు.

ఈ సారైనా నెరవేరేనా?

గతేడాది మాదిరిగానే ఈసారి కూడా తల్లికి వందనం పథకం అమలుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాటు సక్రమంగా 'అమ్మ ఒడి' పేరుతో తల్లుల బ్యాంక్ ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తూ వచ్చింది. దీంతో ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల ఫీజులను సకాలంలో తల్లిదండ్రులు చెల్లించగలిగారు. అయితే కూటమి ప్రభుత్వం ఇప్పటికే ఏడాది పాటు పథకం లబ్ధిని ఎగ్గొట్టి తాజాగా ఈ నెల 15 లోపు ప్రకటించింది. గతేడాది తరహాలోనే ఈసారి కూడా పథకం లబ్ధి చేకూరకపోవచ్చునని తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	2,078
ప్రైవేట్ పాఠశాలలు	430
ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య	1.47 లక్షల మంది
ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య	80 వేల మంది
జూనియర్ కళాశాలలు	113
జూనియర్ కళాశాల్లో విద్యార్థుల సంఖ్య	10 వేల మంది

అమ్మ ఒడి ద్వారా గత ప్రభుత్వంలో జిల్లాకు చేకూరిన లబ్ధి

విద్యా సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
2019 - 20	1,62,574	243.86
2020 - 21	1,61,554	242.33
2021 - 22	1,66,398	249.60
2022 - 23	1,62,080	210.10
మొత్తం	1,66,398	946.49

ప్రైవేటు సంస్థల్లో ఫీజుల మోత..

తల్లికి వందనం పథకం అతీగతీ లేకపోవడంతో ప్రైవేటు సంస్థల్లో ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో సరైన నిర్వహణ లేకపోవడంతో అక్కడికి విద్యార్థులను పంపించలేని పరిస్థితిని ఆసరాగా చేసుకుని.. డిమాండ్‌కు అనుగుణంగా ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీకి తెరలేపారు.

నాలుగేళ్లలో రూ.946 కోట్లు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాలుగు విడతలుగా జిల్లాకు 'అమ్మ ఒడి' పథకం కింద రూ.946 కోట్లు నేరుగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. ఏటా సగటున 1.62 లక్షల మందికి లబ్ధి చేకూరింది. ప్రస్తుతం జిల్లాలో ఒకటి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో సుమారు 2.37 లక్షల మంది ఉన్నారు. మోసపూరిత వాగ్దానాలతో వీరిలో ఎంత మందికి లబ్ధి చేకూరుస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఫీజులు కట్టలేక ఇబ్బందులు



మాకు ఇద్దరబ్బాయిలు. ఓడీ చెరువులోని ఓ ప్రైవేటు స్కూలులో చదివిస్తున్నాం. ఇద్దరికీ చాలా ఖర్చు వస్తోంది. ఫీజులు కట్టేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు మా కుటుంబానికి ఏటా తల్లికి వందనం పథకం కింద రూ.30 వేలు అందజేయాల్సి ఉంది. ఇప్పటికే ఒక ఏడాది మిస్ అయింది. ఈసారైనా డబ్బులు జమ చేయాలని కోరుతున్నాం. – భారతి, పరాకువాండ్లపల్లి, తనకల్లు మండలం

అవస్థలు పడుతున్నాం



మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. నార్పలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పెద్ద కుమారుడు ఎనిమిదో తరగతి, చిన్న కుమారుడు ఏడో తరగతి చదువుతున్నారు. ఇద్దరికీ ఏడాదికి రూ.80 వేలు ఫీజులు కడుతున్నాం. గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకం వర్తించడంతో ఇబ్బంది లేకుండా ఫీజులు చెల్లించగలిగాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పథకం లబ్ధి చేకూరలేదు. దీంతో ఫీజులు కట్టలేక అవస్థలు పడుతున్నాం. – ఎ.దేవి, రామాపురం, తాడిమర్రి.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం డంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బత్తలపల్లి: స్థానిక బృందావనం కాలనీలో నివాసముంటున్న మల్లికార్జున నాయక్... తన ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 750 కిలోల రేషన్ బియ్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు అనంతపురం రీజినల్ విజిలెన్స్ అధికారులు శ్రీగోపాలుడు, రవీంద్రనాథ్, బత్తలపల్లి సీఎస్‌డీటీ రామకృష్ణ తెలిపారు. బత్తలపల్లి తహసీల్దార్ స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

లేపాక్షి: మండలంలోని తిరుమలదేవరపల్లి గ్రామానికి చెందిన వివాహిత సవిత అలియాస్ సునీత(39) ఆత్మహత్య చేసుకుంది. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమార్తె మమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: రోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న పేర్కొన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినం మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం పుట్టపర్తిలో చేపట్టిన అవగాహన ర్యాలీని వారు ప్రారంభించి, మాట్లాడారు. ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, లేపాక్షి ప్రాంతాల్లో పర్యాటక యోగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, కమిషనర్ క్రాంతికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు లేపాక్షిలో జిల్లా స్థాయి యోగా

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం ఉదయం జిల్లా స్థాయి యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బెల్టుషాపులు బంద్ చేయించి గ్రామంలోకి అడుగు పెట్టండి

- ఎక్సైజ్ పోలీసులతో నాటుసారా తయారీదారుల వాగ్వాదం

గుంతకల్లు: గ్రామాల్లో బెల్టుషాపులు బంద్ చేయిస్తే తాము నాటుసారా తయారీని మానుకుంటామని ఎక్సైజ్ పోలీసులతో గుంతకల్లు మండలం పులగుట్టపల్లి పెద్దతండా వాసులు వాగ్వాదానికి దిగారు. పులగుట్టపల్లి పెద్ద తండాలో ఆదివారం సాయంత్రం గుంతకల్లు ఎక్సైజ్ అధికారులు వెంకటేష్, గోపాల్‌నాయక్, నాగరాజు తనిఖీలు చేపట్టారు. లాలూస్వామి నాయక్ ఇంట్లో పది లీటర్ల నాటుసారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో లాలూస్వామి నాయక్ వాగ్వాదానికి దిగాడు. అదే సమయంలో కృష్ణానాయక్, నెట్టప్పనాయక్, బాలాజీనాయక్‌తో పాటు సీఆర్‌పీఎఫ్ జవాన్ శేఖర్‌నాయక్ అక్కడకు చేరుకుని లాలూస్వామి నాయక్‌కు మద్దతుగా నిలిచారు. బెల్టుషాపులు బంద్ చేయించకుండా మరోసారి గ్రామంలోకి కాలుపెడితే పొలిమేర కూడా దాటలేరంటూ హెచ్చరించారు. ఘటనపై ఎక్సైజ్ సీఐ శివసాగర్‌ను వివరణ కోరగా... జరిగిన ఘటన వాస్తవమేనని అంగీకరించారు. ఇప్పటికే లాలూస్వామి నాయక్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. మంగళవారం పూర్తి స్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

'నారాయణ'లో పాఠ్య పుస్తకాల గది సీజ్



నారాయణ పాఠశాలలో గదిని సీజ్ చేస్తున్న ఎంఈఓ గంగప్ప

హిందూపురం టౌన్: స్థానిక నారాయణ ఒలంపియాడ్ స్కూల్‌లో సోమవారం ఎలాంటి అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి విక్రయిస్తుండగా ఎంఈఓ గంగప్ప గుర్తించి సీజ్ చేశారు. కాగా, ఇదే అంశంపై సోమవారం ఉదయం ఎస్ఎఫ్ఐ, ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నారాయణ పాఠశాల వద్ద ధర్నా జరిగింది. పాఠశాల ఆవరణలోనే పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రి విక్రయిస్తుండడంతో విద్యార్థి సంఘాల నాయకులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న ఎంఈఓ వాటిని పరిశీలించి, విద్యా సామాగ్రి నిల్వ చేసిన గదిని సీజ్ చేశారు. పట్టణంలోని నారాయణ, చైతన్య, భాష్యం పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, పాఠ్య పుస్తకాల పేరుతో అక్రమంగా వేలాది రూపాయలు ఫీ వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, జిల్లా అధ్యక్షుడు సురేష్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఆఫ్రిద్, ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు భరత్, అజ్మల్, ఉమేష్, చింటూ, మోరియా, ఇస్మాయిల్, కుశాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆ డాక్టర్‌పై చర్యలు తీసుకోండి

- పోలీసు స్పందనలో బాధితుడు మనోహర్ ఫిర్యాదు
- వివిధ సమస్యలపై 80 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: తన భార్య మృతికి కారణమైన కదిరి ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ రుచితారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ రత్నను కదిరికి చెందిన బాధితుడు మనోహర్ కోరారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. డాక్టర్ రుచితారెడ్డి తన దైనందిన విధుల అనంతరం స్థానికంగానే నిర్వహిస్తున్న రేణుకా వైద్యశాలలో రోగులకు చికిత్స చేస్తుంటారన్నారు. ఈ క్రమంలో కదిరిలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న మనోహర్... అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్యను చికిత్స నిమిత్తం రేణుకా వైద్యశాలకు తీసుకెళ్లారు. రూ.5 వేల ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. పది రోజుల తర్వాత పరిస్థితి విషమించడంతో ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేసి చేతులు దులుపుకున్నారు. అక్కడ కూడా సరైన చికిత్స అందజేయకపోవడంతో తిరుపతిలోని సిమ్స్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి మే 2న ఆమె మృతి చెందింది. డాక్టర్ రుచితారెడ్డి నిర్లక్ష్యం, సరైన వైద్యం అందించకపోవడంతోనే ఆమె మృతి చెందినట్లుగా అక్కడి వైద్యులు నిర్ధారణ చేశారని బాధితుడు తెలిపాడు. తన భార్య మృతికి కారణమైన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కదిరి పీఎస్‌లో ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోలేదని, ఈ విషయంగా తనకు న్యాయం చేయాలంటూ డీఎస్పీ విజయకుమార్ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన డీఎస్పీ కదిరి పోలీసులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు. కాగా, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 80 వినతులు అందగా.. ఎస్పీ రత్న స్వయంగా స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, మహిళా డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీటీ లేని ప్రాంతాన్ని ఊహించలేం

- ఆరో రోజు పాదయాత్రలో మాజీ ఎంపీ తలారి రంగయ్య



యర్రగుంటలో మాట్లాడుతున్న రంగయ్య (చిత్రంలో) ఉమామహేశ్వరనాయుడు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్

కుందుర్పి: ఆర్డీటీ లేని ప్రాంతాన్ని ఊహించలేమని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేని పాలకులు.. ఆవు లాంటి ఆర్డీటీని జిల్లా నుంచి తరిమేసే కుట్రలకు తెరలేపారని మండిపడ్డారు. రంగయ్య చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర సోమవారం ఆరో రోజు కుందుర్పి మండలం యర్రగుంటకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఆర్డీటీనీ కాపాడుకుని తీరుతామని మరోసారి స్పష్టం చేశారు.ఈ ప్రాంతంలో ఆర్డీటీ సేవలు ఆగిపోతే జరిగే నష్టాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. తనను అరెస్ట్ చేసినా... చైతన్యవంతులైన ప్రజలే ఆర్డీటీని కాపాడుకుంటారని అన్నారు. గ్రామానికి చెందిన చిట్టెమ్మ మాట్లాడుతూ.... తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, షుగర్ వ్యాధితో బాధపడుతున్న తాను ఇప్పటి వరకూ ఆర్డీటీ ఆస్పత్రిలోనే ఉచితంగా చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఇటీవల విదేశీ నిధులు రాకపోవడంతో ఆస్పత్రిలో మందుల కొరత కారణంగా డబ్బులు ఖర్చు పెట్టి బయట కొనాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీటీ లేకపోతే తన ఇద్దరు పిల్లల పెళ్లిళ్లు ఎలా చేయాలో అర్థం కావడం లేదని కన్నీరు పెట్టుకున్నారు.

- ఆర్డీటీ సేవల పునరుద్ధరణకు తలారి రంగయ్య సాగిస్తున్న పోరాటాన్ని అడ్డుకునేందుకు పోలీసులను పావుగా వాడుకునేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ అన్నారు. పాదయాత్ర అపిలేపల్లికి చేరుకున్న సందర్భంగా ఆయన తలారి రంగయ్యను కలసి సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో మాటాడారు. ఆర్డీటీ లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి సమాంతరంగా పనిచేస్తున్న ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తిప్పేస్వామి, తరిమెల గోకుల్‌రెడ్డి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు, ఎంపీపీ కమలానాగరాజు, పార్టీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు ఫయాజ్, సత్యనారాయణరెడ్డి, గార్లదిన్నె నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖజానా శాఖలో బదిలీలు

అనంతపురం అర్బన్: జిల్లా ఖజానా శాఖలో బదిలీల ప్రక్రియ పూర్తయింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం జారీ చేశారు. 20 మంది సీనియర్ అకౌంటెంట్లు, తొమ్మిది మంది జూనియర్ అకౌంటెంట్లు, 11 మంది అటెండర్లు, నలుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లను బదిలీ చేస్తూ ఇతర ప్రాంతాలకు పోస్టింగ్ ఇచ్చారు.

వ్యవసాయ శాఖలో...

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యవసాయ శాఖలో నలుగురు సీనియర్ అసిస్టెంట్‌లు బదిలీ అయ్యారు. శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఎం. నాగమణిని, నంద్యాలలో పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను అనంతపురంలోని డీఏఓ కార్యాలయానికి బదిలీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న సునీతను డీడీఏ(ఎస్‌సీ) కార్యాలయానికి, అనంతపురంలో పనిచేస్తున్న మధుమతిని హిందూపురం ఏడీఏ కార్యాలయానికి బదిలీ చేశారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో వంచకుడికి రిమాండ్

కదిరి టౌన్: యువతిని ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో వంచకుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. కదిరి సీఐ వి.నారాయణరెడ్డి తెలిపిన మేరకు.. కదిరి పట్టణానికి చెందిన ఓ యువతిని పెళ్లి పేరుతో పుట్టపర్తి మండలం దిగువ చెర్లోపల్లికి చెందిన ప్రకాష్ లోబర్చుకున్నాడు. శారీరక అవసరాలు తీర్చుకున్న అనంతరం పెళ్లికి నిరాకరిస్తూ వేధించసాగాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి ఇటీవల ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఈ నెల 3న కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం కదిరిలోని హిందూపురం మార్గంలో ఉన్న గట్లు వద్ద ప్రకాష్‌ను గుర్తించి అరెస్ట్ చేసి, అనంతపురంలోని న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వంద శాతం లక్ష్యాలను చేరుకోవాలి : డీఎంహెచ్ఓ



వివరాలు ఆరా తీస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం

పుట్టపర్తి అర్బన్: నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు వైద్య పరీక్షలు, టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని సంబంధిత అధికారులను డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం ఆదేశించారు. టీకాల కార్యక్రమంపై సోమవారం తన చాంబర్‌లో వైద్యాధికారులు, సిబ్బందితో ఆమె సమీక్షించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ నాగరాజు, ఎస్ఓ కళాధర్, డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ, బాలాజీనాయక్ , వైద్యాధికారులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

తల్లీకొడుకు అదృశ్యం

కదిరి టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో స్థానిక అడపాలవీధికి చెందిన షేక్ నజీమా, తన రెండేళ్ల వయసున్న కుమారుడితో కలసి ఈ నెల 2న ఇల్లు విడిచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి గాలింపు చేపట్టినా ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లి షేక్ షబానా ఫిర్యాదు మేరకు సోమవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. కాగా, గతంలోనూ ఆమె తన కొడుకును తీసుకెళ్లి 10 రోజుల తరువాత తిరిగి వచ్చినట్లుగా తల్లి పేర్కొనడం గమనార్హం.

పాము కాటుతో వ్యక్తి మృతి

సోమందేపల్లి: మండలంలోని చాలకూరు గ్రామానికి చెందిన ఆదినారాయణ (40) పాము కాటుతో మృతిచెందాడు. రొద్దం మండలం చెరుకూరు గ్రామం వద్ద మామిడి తోటలో కూలి పనులకు ఆదివారం వెళ్లాడు. సోమవారం ఉదయం పని ప్రాంతంలో పాము కాటు వేయడంతో పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆదినారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్

తనకల్లు: స్థానిక 42వ జాతీయ రహదారి పక్కనే బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌ను సోమవారం రాత్రి ఆషిక్ అనే యువకుడు ఎక్కి హల్‌చల్ చేశాడు. దాదాపు వంద అడుగులు ఎత్తు ఉన్న టవర్ చివరి భాగానికి చేరుకుని అక్కడే కూర్చున్నాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. పోలీసులు టవర్ వద్దకు చేరుకుని కిందికి దిగి రావాలని పదే పదే కోరినా అతడు స్పందించలేదు. దీంతో చాలా సేపు పోలీసులు టవర్ వద్దే వేచి చూసి చివరకు పక్కకు వెళ్లారు. పోలీసులు లేరని తెలుసుకున్న యువకుడు తనంతకు తాను టవర్ దిగి వెళ్లిపోయాడు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

రాప్తాడు: ప్రమాదవశాత్తు రైలు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... పామిడి మండలం రామరాజుపల్లి గ్రామానికి చెందిన వడ్డే నారాయణ (82) 15 ఏళ్లుగా చిన్మయనగర్ సమీపంలోని పంచాయతీరాజ్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అక్కడే ఉన్న సిమెంట్ పెల్లల పరిశ్రమలో 12 ఏళ్లుగా కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా ఫిట్స్ రావడం, మతి స్థిమితం సరిగ్గా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం రాప్తాడులో పని ఉందంటూ బయలుదేరిన ఆయన పండమేరు వంక రైల్వే వంతెనపై వెళుతుండగా వేగంగా దూసుకొచ్చిన రైలు ఢీకొంది. ఘటనలో ఎగిరి పట్టాల పక్కన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ధర్మవరం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి చిన్న కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.